క్లుప్తంగా

కృపాలక్ష్మికి ఆహ్వానం


కృపాలక్ష్మికి పుష్పగుచ్ఛం అందిస్తున్న నేతలు

వెదురుకుప్పం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గంగాధర నెల్లూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ కృపాలక్ష్మిని వెదురుకుప్పం మండలం నాయకులు పురంధర్ రెడ్డి, పెరుమాళ్లపల్లి ఎంపీటీసీ తోకల మురళి రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఆదివారం వారు విజయవాడలోని ఆమె స్వగృహానికి వెళ్లి పుష్పగుచ్ఛం అందించారు. ఈనెల 17వ తేదీ జరగనున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పురంధర్ రెడ్డి సోదరి వివాహ మహోత్సవానికి రావాలని ఆమెను ఆహ్వానించి పెళ్లిపత్రికను అందజేశారు.

కంచి పీఠాధిపతులకు ఘన స్వాగతం


ప్రసాదం అందజేస్తున్న స్వాముల వారు

పుత్తూరు: కంచి కామకోటి పీఠం ఉత్తరాధికారిగా పట్టాభిషిక్తులైన శ్రీసత్య చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామీజీ, వారి గురువులైన శ్రీవిజయేంద్ర సరస్వతి స్వామికి పుత్తూరు శ్రీగాయత్రీ బ్రాహ్మణ సంఘం ఘన స్వాగతం పలికింది. స్వాముల వారు కలిసి తొలిసారిగా తిరుమలకు వెళుతున్న సందర్భంగా శనివారం అర్ధరాత్రి పుత్తూరుకు చేరుకున్నారు. స్థానిక మలేషియా సుబ్రమణ్యస్వామి ఆలయం వద్ద బ్రాహ్మణ సంఘం వారు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. పలువురు పట్టణ ప్రజలు, భక్తులు స్వాముల వారిని దర్శించుకుని వారి చేతుల మీదుగా ప్రసాదాలు అందుకున్నారు. కార్యక్రమం బ్రాహ్మణ సంఘ గౌరవాధ్యక్షులు ఆలూరి రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు.

టోర్నీ విజేతగా పెద్దతయ్యూరు జట్టు


విజేతగా నిలిచిన పెద్దతయ్యూరు జట్టు

శ్రీరంగరాజపురం: గంగాధరనెల్లూరు నియోజకవర్గస్థాయిలో నిర్వహించిన సమ్మర్ క్రికెట్ టోర్నీ విజేతగా పెద్దతయ్యూరు జట్టు నిలిచింది. ఆదివారం యూఎం పురంలో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో యూఎం పురం జట్టుపై పెద్దతయ్యూరు జట్టు విజేతగా నిలిచింది. గెలుపొందిన జట్టుకు రూ.40 వేలు నగదు బహుమతి, ట్రోఫీ, రన్నర్ జట్టుకు రూ.20 వేలు బహుమతితో పాటు మెడల్స్, కప్ అందించారు. టోర్నీలో ప్రతిభ చూపిన సురేష్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, అనిల్‌కుమార్ మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచారు. గెలుపొందిన జట్టుకు గ్రామస్తులు పెద్దఎత్తున బాణసంచా కాల్చి మంగళ హారతులతో ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ వరదమ్మ గెలుపొందిన క్రీడాకారులను అభినందించి సన్మానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మానసిక ఉల్లాసంతో పాటు గ్రామీణ క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను చాటుకోవడానికి ఇలాంటి టోర్నీలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. పంచాయతీ స్థాయిలో క్రీడలను ప్రోత్సహించడంతో పాటు క్రీడా మైదానం ఏర్పాటుకు కృషి చేస్తా అన్నారు.

వేడుకగా గంగజాతర


గంగమ్మకు అంబలి పోస్తున్న మహిళలు

వెదురుకుప్పం: మండలంలోని టీకేఎంపురం (తిరుమల కొండమాంబాపురం) గ్రామంలో గంగ జాతర వైభవంగా ప్రారంభమైంది. సుమారు 30 ఏళ్ల తరువాత నిర్వహిస్తున్న జాతరకు గ్రామస్తులు భారీ ఏర్పాట్లు చేశారు. ఆదివారం నడి వీధి గంగమ్మకు మహిళలు అంబలి పోసి పూజలు నిర్వహించారు. సాయంత్రం గ్రామ సమీపంలో ఉన్న బాటగంగమ్మ పెద్దఎత్తున మహిళలు పొంగళ్లు పెట్టి ప్రసాదాలను అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. రాత్రి గంగమ్మ చాటింపు చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారికి పసుపు, కుంకుమతో పాటు పుష్పాలతో ఆకర్షణీయంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం చాటింపు వేసి ఉత్సవాలకు అంకురార్పణ చేశారు.


బాటగంగమ్మ ఆలయ ఆవరణలో పొంగళ్లు పెడుతున్న మహిళలు

విత్తు.. జాగ్రత్త

ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్న తరుణంలో అన్నదాతలు సాగుకు సిద్ధమయ్యారు. రైతులు పంటసాగు చేయడానికి ముందే ఎరువులు, పురుగుమందులు, విత్తనాల కొనుగోలు విషయంలో చాలా అప్రమత్తంగా ఉండాలి. లేదంటే ఆరుగాలం పడిన కష్టం బూడిదలో పోసిన పన్నీరే అవుతుంది. విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసేటప్పుడు జాగ్రత వహించాలని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

- ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగుకు రైతులు సమాయత్తం
- పంట సాగు చేసే విత్తన విషయంలో అప్రమత్తత తప్పనిసరి
- ఎరువులు కూడా అవసరమైన మేర వినియోగించాలి
- లేదంటే పంట నష్టం తప్పదంటున్న వ్యవసాయ అధికారులు


వేరుశనగ విత్తనాలను వేరు చేస్తున్న కూలీలు(ఫైల్)

పాలసముద్రం: రైతులు ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్నారు. ఈ క్రమంలో పంట సాగు చేసే విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల కొనుగోలుపై సరైన అవగాహన లేక చాలామంది రైతులు నష్టపోతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో నకిలీల బెడద ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

విత్తన కొనుగోలులో జాగ్రత్త..

వ్యవసాయశాఖ నుంచి లైసెన్సు పొందిన డీలర్ల నుంచే రైతన్నలు విత్తనాలు కొనుగోలు చేయాలి. విత్తన కొనుగోలు బిల్లుపై నంబరు, విత్తన రకం, గడుపు తేదీలు, డీలరు సంతకం, రైతు సంతకం బిల్లుపై ఉండేలా చూసుకోవాలి. లూజుగా ఉన్న సంచులు, పగిలిన ప్యాకెట్లు, తెరిచిన డబ్బాల నుంచి విత్తనాలు కొనవద్దు. గడువు దాటిన విత్తనాల జోలికి వెళ్లొద్దు. బిల్లుపై విక్రయదారుడి పేరు, కేంద్ర, రాష్ట్ర అమ్మకపు పన్ను నంబరు, రైతుపేరు, గ్రామం పేరు, రైతు, విక్రయదారుడి సంతకం, తేదీలు, రకం పేరు, బ్యాచ్ నంబర్, గడుపు తేదీలు, నికర తూకం, నికర ధర, కంపెనీ పేరు తప్పనిసరిగా నమోదు చేయాలి. కొనుగోలు చేసే విత్తన ప్యాకెట్, సీసా, సంచి, డబ్బాలపై సీలు ఉందా ? లేదా ? అని నిర్ధారించుకోవాలి. విక్రయదారుడు ఇచ్చే కరపత్రాలు తీసుకుని వాటిలో పేర్కొన్న అంశాలను చదవాలి. కొనుగోలు చేసిన సరుకును డీలర్ వద్దే తూకం వేయించాలి. మొలకెత్తే దశ, పూత దశలో పంటలో లోపం కనిపిస్తే వెంటనే వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలి. విత్తనాలు కొనుగోలు చేసిన బిల్లులను పంట కాలం పూర్తయ్యేంత వరకు దాచుకోవాలి. ఎరువులు, విత్తనాలు అరువు తెచ్చుకున్నప్పటికీ బిల్లు తప్పనిసరిగా తీసుకోవాలి. విత్తనాలు తీసుకున్న వెంటనే మొలక శాతం చూసుకోవాలి.

పురుగు మందుల కొనుగోలులో..

పంటలో చీడపీడల నివారణకు వినియోగించే క్రిమి సంహారక మందుల కొనుగోలు సమయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలి. వ్యవసాయ, ఉద్యాన శాఖ శాస్త్రవేత్తలు సూచించిన పురుగుమందులనే వినియోగించాలి. అవసరానికి మించి కొనుగోలు చేసిన, నిల్వ ఉంచిన పురుగు మందులను వాడొద్దు. లైసెన్సు ఉన్న దుకాణాల్లోనే కొనుగోలు చేయాలి. పురుగు మందు డబ్బాలపై వజ్రాకారంలో పురుగు మందు స్థాయిని తెలిపే రంగులు ఉంటాయి. అత్యంత విషపూరితమైతే నీలం రంగు, స్వల్ప విషపూరితమైతే డబ్బాలపై ఆకుపచ్చ రంగు గుర్తులుంటాయి. పురుగు మందులు రెండు, మూడు రకాలు కలిపి వాడకూడదు. వాడిన డబ్బాలు, సీసాలు ధ్వంసం చేసి గుంతలో పూడ్చాలి. పురుగు మందుల వాడకానికి వినియోగించిన పాత్రలను ఇతర అవసరాలకు వినియోగించరాదు.

ఎరువుల కొనుగోలులో..

లైసెన్సు దుకాణాల్లోనే కొనుగోలు చేయాలి. కొనుగోలు చేసిన బిల్లులు, ఖాళీ సంచులను పంటకాలం పూర్తయ్యే వరకు జాగ్రత్తగా ఉంచుకోవాలి. మిషన్ కుట్టుతో ఉన్న ఎరువుల సంచులు మాత్రమే వాడాలి. ఒకవేళ చేతి కుట్లు ఉంటే సీసం సీల్ ఉందో లేదో చూసుకోవాలి. ప్రామాణిక పోషకాల వివరాలు, ఉత్పత్తి సంస్థ, ఉత్పత్తిదారుడి పేరు ఖచ్చితంగా ఉండాలి. కొనుగోలు సమయంలో డీలర్ రికార్డుల్లో రైతు విధిగా సంతకం చేయాలి. ఎరువుల నాణ్యతపై అనుమానం ఉంటే వెంటనే వ్యవసాయాధికారి సహాయంతో ఎరువులను పరీక్షలకు పంపాలి. చిల్లులు పడిన.. చిరిగిన ఎరువుల బస్తాలను కొనుగోలు చేయవద్దు. అన్యపదార్థాలు కలిసే ఆ ఎరువును కల్తీ అని గుర్తించాలి.

కల్తీని ఇలా గుర్తించవచ్చు

యూరియా, క్యాల్షియం, అమ్మోనియం, నైట్రేట్ వంటి ఎరువులు గుళిక రూపంలో ఉంటాయి. 15:15:15, 20:20:0 ఎరువులు రేణువుల రూపం


ఖరీఫ్‌లో వేరుశనగ సాగుకు దుక్కులు సిద్ధం చేస్తున్న రైతన్నలు


వేరుశనగ సాగు చేస్తున్న రైతు(ఫైల్)

కమనీయం.. లక్ష్మీనారాయణుడి కల్యాణం

గంగాధర నెల్లూరు: మండలంలోని వేపంజేరి గ్రామంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీ నారాయణ స్వామి కల్యాణోత్సవం ఆదివారం కమనీయంగా జరిగింది. సుప్రభాత సేవతో స్వామి వారిని మేల్కొల్పిన అర్చకులు స్వామి, అమ్మవార్లకు సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేశారు. అనంతరం ప్రత్యేక పుష్పాలతో అలంకరించి పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం అర్చకుల వేద మంత్రోచ్ఛరణల మధ్య కల్యాణం వైభవంగా జరిగింది. చెన్నై నగరానికి చెందిన దీనదయాల్ కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో హరికథా కాలక్షేపం, అన్నమయ్య సంకీర్తనలు భక్తులను అలరించాయి. అనంతరం భక్తులకు అన్నదానం చేపట్టారు. ఉభయదారులకు స్వామివారి చిత్రపటాన్ని అందించి ఆలయ సిబ్బంది సత్కరించారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం


క్రికెట్ ప్రారంభోత్సవంలో క్రీడాకారులు

పాలసముద్రం: మండలంలోని ఆముదాల గ్రామంలో యువత ఆదివారం క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించారు. ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఆముదాల సర్పంచ్ అనురేఖ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల యువకులు తమలోని క్రీడాప్రతిభను వెలికి తీసుకోవడానికి క్రికెట్ టోర్నమెంట్ దోహదపడుతుందని తెలిపారు. ఆటల్లో గెలుపు ఓటమి సహజమని, క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలన్నారు. టోర్నీలో గెలుపొందిన యువకులకు మొదటి బహుమతి శివ నాయుడు రూ.30 వేలు, రెండో బహుమతి సర్పంచ్ అనురేఖ రూ.20 వేలు, మూడవ బహుమతి రోశి నాయుడు రూ.15 వేలు వితరణ చేశారు. కార్యక్రమంలో ధనపాల్, చలయ్య, అనస్ట్రార్, శేఖర్ యువకులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీపీ రాజారెడ్డికి నివాళి


రాజారెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి


రాజారెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సత్యవేడు నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాజేష్

గంగాధర నెల్లూరు: మండల సీనియర్ నాయకులు, మొట్టమొదటి ఎంపీపీ రాజారెడ్డి గత కొద్ది రోజుల క్రితం మృతి చెందారు. ఆదివారం ఆయన కర్మక్రియల సందర్భంగా మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి గ్రామానికి చేరుకుని రాజారెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. మండలాన్ని ప్రగతి పథంలో నడిపించిన ప్రముఖుల్లో రాజారెడ్డి ఒకరని, ఆయన సేవలు ఎనలేనివని గుర్తు చేసుకున్నారు. అదేవిధంగా సత్యవేడు నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాజేష్ కూడా రాజారెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు వెంకటరెడ్డి, వైస్ ఎంపీపీ హరిబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు కృష్ణారెడ్డి, రఘునాథరెడ్డి, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

రోజాపై ఆరోపణలు అవాస్తవం

- టీడీపీ కేంద్ర కార్యాలయానికే వస్తాం నిరూపించండి
- తప్పుడు ఆరోపణలు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవు
- మున్సిపల్ చైర్మన్ నీలమేఘం స్పష్టీకరణ


ఎఫ్ఎంబీ మ్యాప్‌లను చూపుతున్న చైర్మన్ నీలమేఘం బృందం

నగరి: స్థానిక జ్యోతినగర్‌లో మాజీ మంత్రి రోజా, ఆమె భర్త సెల్వమణితో కలసి తాను భూ కబ్జాకు పాల్పడినట్లు పత్రికల్లో వచ్చిన వార్తలు పూర్తిగా అవాస్తవమని మున్సిపల్ చైర్మన్ నీలమేఘం స్పష్టం చేశారు. ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడుతూ ఆ భూమి చింతలపట్టెడకు చెందిన మీనాకుమార్ కుటుంబానికి చెందిన ఆస్తి అని తెలిపారు. ఆ భూమిలో కొంత భాగం నేషనల్ హైవే నిర్మాణానికి పోగా అందుకు సంబంధించి రెవెన్యూ శాఖ వారు నష్ట పరిహారం సైతం చెల్లించినట్లు వివరించారు. దీనిపై కోర్టులో సైతం కేసు నడుస్తోందని వెల్లడించారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయానికే తాను, మీనాకుమార్ కుటుంబ సభ్యులు తగిన ఆధారాలతో వస్తామని, దమ్ముంటే గుణశేఖర్‌రెడ్డి చేసిన ఆరోపణలు నిరూపించాలని సవాల్ చేశారు. లేనిపక్షంలో టీడీపీ కార్యాలయమే గుణశేఖర్‌రెడ్డిపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మాజీ మంత్రి రోజా, ఆమె భర్త సెల్వమణితోపాటు తనపై చేసిన ఆరోపణలు నిరూపించాలని లేనిపక్షంలో గుణశేఖర్‌రెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్రంలో అన్నిచోట్లా, అన్ని వేళలా రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని కొనసాగించాలనుకోవడం అవివేకమన్నారు. సమావేశంలో పట్టణ పార్టీ వైస్ చైర్మన్ మునివేలు, మీనాకుమార్ కుమారులు అయ్యప్ప, కుమార్, కౌన్సిలర్లు మోహన్‌రాజ్, బాబు, ఇందిరయ్య, మురగ పాల్గొన్నారు.

మాతమ్మా... చల్లగా చూడవమ్మా


మాతమ్మ పూజల్లో మాజీ మంత్రి రోజా

నగరి: అందరినీ చల్లగా చూడాలని మాతమ్మను ప్రార్థించినట్లు మాజీ మంత్రి ఆర్కే రోజా తెలిపారు. నగరి రూరల్ మండలం గుండ్రాజుకుప్పం ఏఏడబ్ల్యూలో ఆదివారం జరిగిన మాతమ్మ ఆలయ మహాకుంభాభిషేకంలో ఆమె పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఆమెకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఆలయ మర్యాదలు చేశారు. ఆమె వెంట పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

శ్రీశీతలాంబ ప్రతిష్ఠలో పాల్గొనడం అదృష్టం

శ్రీశీతలాంబ ప్రతిష్ఠలో తాను పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నట్లు మాజీ మంత్రి ఆర్కే రోజా పేర్కొన్నారు. మేలపట్టు గ్రామంలో శ్రీశీతలాదేవి ఆలయంలో శీతలాంబ ప్రతిష్ఠ చుట్టూ అష్టదిగ్బంధనం, 108 కలశాలతో అమ్మవారి అభిషేక కార్యక్రమాల్లో ఆమె పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అంతకు ముందు రోజాను ఆలయ నిర్వాహకులు మేళతాళాలు, మంగళవాయిద్యాల మధ్య ఘన స్వాగతం పలికారు.


ప్రసాదం స్వీకరిస్తున్న మాజీ మంత్రి రోజా

హామీలను మరచి.. మభ్య పెట్టే యత్నం


డీఎం పురంలో శుభకార్యానికి హాజరైన మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

కార్వేటినగరం: సీఎం చంద్రబాబునాయుడు అదిగో పోలవరం, ఇదిగో అమరావతి అంటూ ఇచ్చిన హామీలను మరచి ప్రజలను మభ్యపెట్టేందుకు చూస్తున్నాడని మాజీ ఉపముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి విమర్శించారు. ఆదివారం ఆయన మండల పరిధిలోని డీఎం పురంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు విజియల్ ఇంట్లో జరిగిన శుభకార్యానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ చరిత్రలో నిలిచిపోయేలా సంక్షేమాలు అందించిన ఘనత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదే అన్నారు. సచివాలయాల విలీనం పేరిట ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత దూరం చేసే యత్నం చేస్తున్నాడని ఆరోపించారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు వెంకటరత్నం, జగదీష్, గాంధీ,హెడ్వర్డ్, త్యాగరాజు, రవి తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా అర్జున తపస్మాన్


తపస్సు మాను ఎక్కుతున్న అర్జున వేషధారి

పాలసముద్రం: మండలంలోని అలిమేలు మంగాపురం గ్రామంలో ద్రౌపదీదేవి అమ్మవారి మహాభారత ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా ఆదివారం అర్జున తపస్మాన్ ఘట్టం కనుల పండువగా జరిగింది. వేణుగోపాల నాట్య మండలి అర్జున వేషధారి భాస్కర్ తపస్మాన్ చెట్టులోని ప్రతి మెట్టును ఎక్కేటప్పుడు పరమ శివున్ని వేడుకుంటూ ఆలపించిన పద్యాలు ఆకట్టుకున్నాయి. తపస్సు మాను అధిరోహించిన అనంతరం సంతానలేమితో బాధపడుతున్న పలువురు మహిళలు వరపడ్డారు. అర్జున పాత్రధారి తపస్సు మాను మీద నుంచి పూలు, నిమ్మకాయలు, విబూది విసరడంతో వాటి కోసం భక్తులు ఎగబడడంతో తొక్కిసలాట చోటు చేసుకుంది. ఈ వేడుకకు స్థానిక ప్రజలతో పాటు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి ప్రజలు పెద్దఎత్తున తరలి రావడంతో శ్రీకృష్ణ, ద్రౌపదీదేవి ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది.


పూలు, నిమ్మకాయల కోసం ఎగబడుతున్న భక్తజనం

శాస్త్రోక్తంగా మహా కుంభాభిషేకం


మహాకుంభాభిషేకానికి కలశాల్లో జలాలను

పాలసముద్రం: మండలంలోని శ్రీకావేరిరాజుపురం గ్రామంలో వెలసిన వరసిద్ధి విఘ్నేశ్వరస్వామి, రాధారుక్మిణీ సమేత శ్రీకృష్ణుడి ఆలయ అష్టబంధన మహాకుంభాభిషేకం వైభవంగా ఆదివారం ముగిసింది. ఉదయం వేదపండితులు 4వ కాల యాగ శాంతిపూజ, నాడీ సంతానం, కుంకుమార్చన మహా పూర్ణాహుతి చేపట్టారు. ఉదయం 8.45 గంటలకు రెండు రోజులుగా యాగశాల పూజలు చేపట్టారు. మంగళవాయిద్యాల నడుమ కలశాలను ఊరేగింపుగా తీసుకొచ్చిన వేదపండితులు స్వామి వారి ఆలయంపై ఉంచి నీరు పోసి మహాకుంభాభిషేకం చేపట్టారు. ఆ నీటిని తమపై చల్లుకోవడానికి భక్తులు ఆలయ ఆవరణకు పోటెత్తారు. అనంతరం తీర్థప్రసాదం వినియోగం చేశారు. అలాగే స్వామి వార్లను సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. మహాకుంభాభిషేక వేడుకల్లో స్థానిక ప్రజలతో పాటు తమిళనాడు, కర్ణాటక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


భక్తులపై కలశ నీటిని చల్లుతున్న పండితులు

అలరించిన దుర్యోధన వధ




భీమ, దుర్యోధన వేషధారుల యుద్ధ సన్నివేశం, అలంకరణలో అమ్మవారు, పూజలో మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి

వెదురుకుప్పం: మండలంలోని చవటగుంటలో ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో గత 10 రోజులుగా జరుగుతున్న మహాభారత ఉత్సవాలు ఆదివారం దుర్యోధన వధ ఘట్టంతో ముగిశాయి. ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేక పూజలు చేపట్టారు. తదుపరి భాగవతారిణి హరికథా కాలక్షేపం చేశారు. మధ్యాహ్నం దుర్యోధన వధ ఘట్టాన్ని కళాకారులు రక్తికట్టించారు. ముందుగా గంగమడుగులో దాక్కున్న దుర్యోధనున్ని భీముడు బయటకు రప్పించే సన్నివేశం ఆహుతులను అలరించింది. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన దుర్యోధనుడి ప్రతిమ వద్ద సాగిన భీమ, దుర్యోధన వేషధారుల భీకర పోరు భక్తులను కట్టిపడేసింది. ఇద్దరి మధ్య వీరోచితంగా సాగిన పోరులో దుర్యోధనుడు తనువు చాలించాడు. కళాకారుల నాటక ప్రదర్శన ఆద్యంతం ఆకట్టుకుంది. తదుపరి ధర్మరాజుల పట్టాభిషేకం జరిగింది. సాయంత్రం అమ్మవారి అగ్నిగుండ ప్రవేశాన్ని భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు కంకణదారులై ఉపవాసాలతో అగ్నిగుండ ప్రవేశం చేసి మొక్కులు తీర్చుకున్నారు. మహా భారత ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. విద్యుత్ దీపాల అలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. భక్తులకు అన్నదానం చేశారు.

మాజీ డిప్యూటీ సీఎం ప్రత్యేక పూజలు

ఉత్సవాల సందర్భంగా మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్వాహకులు ఆలయ మర్యాదలతో ఆయనకు స్వాగతం పలికారు. అదేవిధంగా సత్యవేడు నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాజేష్ ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. వారి వెంట వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మనాభరెడ్డి, ఉపాధ్యక్షులు చిరంజీవిరెడ్డి, గోవిందన్, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి రామయ్య, ప్రచార కమిటీ జిల్లా అధ్యక్షుడు బట్టీ సుబ్రమణ్యం, కో-ఆప్షన్ సభ్యుడు వెంకటేశ్, సర్పంచ్ గోవిందయ్య, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు బండి హేమసుందర్‌రెడ్డి, వైద్య విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు కోలార్ ప్రకాష్, మండల కార్యదర్శి బొజ్జారెడ్డి, సింగిల్‌విండో మాజీ డైరెక్టర్ మునికృష్ణారెడ్డి, కార్యనిర్వాహక సభ్యులు వెంకటేశ్, మైనారిటీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గఫూర్, మాజీ సర్పంచ్ రమేష్‌రెడ్డి ఉన్నారు.

కార్వేటినగరంలో..


అమ్మపల్లిలో..

కార్వేటినగరం: మండలంలోని అమ్మపల్లి సమీపంలో వెలసిన శ్రీద్రౌపదీ, ధర్మరాజులస్వామి వారి ఆలయంలో నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం దుర్యోధన వధ ఘట్టంతో అట్టహాసంగా ముగిశాయి. ఉదయం అర్చకులు ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేపట్టి భక్తులకు దర్శనం కల్పించారు. మధ్యాహ్నం భాగవతారిణి హరికథా కాలక్షేపం చేశారు. అనంతరం శ్రీవేంకటేశ్వర నాట్య కళామండలి ఆధ్వర్యంలో కళాకారులు దుర్యోధన వధ ఘట్టాన్ని ప్రదర్శించారు. దుర్యోధనుడు గంగమడుగులో దాక్కొని ఉండగా భీమసేనుడు బయటకు రప్పించే ఘట్టం చూపరులను విశేషంగా ఆకట్టుకుంది. అలాగే ఆదివారం రాత్రి కంకణాలు ధరించిన భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేశారు.

అపూర్వకలయిక



తాము చదివిన పాఠశాలలోనే కలుసుకున్న పూర్వ విద్యార్థులు

వడమాలపేట (విజయపురం): వడమాల పేట ఉన్నత పాఠశాలలో 1999-2000 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం సరదాగా, ఉత్సాహంగా గడిపారు. 25 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా సిల్వర్ జూబ్లీ సెలబ్రేషన్స్ ఘనంగా జరుపుకొని ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు.